క్షితిజ

యుగానికి లేని విలువ ఒక్కక్షణం సంతరించుకుంటుంది. జీవితకాలం అంతా శ్రమించి నిర్మించిన దానిని ఒక్క క్షణంలో నిర్మూలించవచ్చు. మానవత విస్మరించటం క్షణమాత్రమే అయినా పరిణామం అతిభీకరంగా ఉంటుంది.

శ్యామలను పెళ్ళి చేసుకోవటానికి కృతనిశ్చయుడైన రంగబాబు ఆమె అంటే విముఖత చూపడానికి హేతువు ఒక్క క్షణంలో జరిగిన పరిణామం.

కావాలని ప్రాకులాడడమే కనిపిస్తుందికాని ఏదీ కోరుకున్నది ఒక్కొక్కమారు దక్కదు. మానవ జీవితమే అంత. భూమి అకాశాలు కలిసినట్లుగా కన్పిస్తాయి. అయితే ఆ రేఖను చేరుకోవాలని ప్రయత్నించటం సాహసమే అవుతుంది. పోగొట్టుకున్న దానిని గురించి బాధపడని వ్యక్తి వుండడు. ఒక్కక్షణంలో చేసిన చిన్న పొరపాటు జీవితాలనే మార్చివేస్తుంది. మనిషి ఔన్నత్యానికి కొలమానం అతని ఆంతస్తు, ఆస్తి కాలేవు. మనిషి ఉచ్చస్థితిలో ఉన్నప్పుడు ఆదరించటం - అభిమానం చూపడం సహజమే! కాని మనిషి ఆపదలో ఉన్నప్పుడు ఆదుకోవాలని అనుకునేవారు అరుదు. ఈ రెండో కోవకు చెందిన వ్యక్తి తారసపడితే, అలాంటి వారిమీద ఎంతటి జుగుప్సవున్నా ఎంతటి హీనభావం వున్నా వారిలో ఆ క్షణంలో దైవం కనిపిస్తాడు. ఇది రంగబాబు తెలుసుకున్న సత్యం.

క్షణికోద్రేకంలో దైవసమానులను ఏ బలహీన క్షణాల్లోనో కించపరచితే ఆ దైవం క్షమించగలదు అనుకోవటం పొరపాటే! రంగబాబు తెలుసుకోలేకపోయినదీ సత్యం.

★ ★ ★

"అదిగో, ఆ కనుపిస్తున్న డాబాలోనే వుంటున్నారు వెంకట్రామయ్యగారు" అన్నాడతను.

కాలిబాటను రెండుకిలోమీటర్లు నడిచి వచ్చిన రంగబాబుకి కొంత రిలీఫ్ కలిగింది. ఈ ఊరు అతనికి కొత్త. సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లమా చేసిన అతనికి ఆరునెలలు తిరక్కుండానే ఉద్యోగం దొరికింది. ఆర్డరు చూడగానే అతనికి ఆశ్చర్యమూ ఆనందమూ కలిగాయి. ఒక మారుమూల కుగ్రామంలో అని చూసిన అతనికి బాధ కలిగింది. ఉద్యోగాలు దొరకడమే కష్టంగా ఉన్న ఈ రోజుల్లో సునాయాసంగా దొరికిన ఉద్యోగాన్ని వదులుకోవడానికి అతనికి మనస్కరించలేదు.

ఊరూ వసతులు గ్రహించుకునే వరకు సింపుల్‌గా వెళ్ళడమే వుత్తమమని నిశ్చయించుకున్నాడు.

"తోటపల్లా! చెప్పవేం. అక్కడ వెంకట్రామయ్యగారున్నారు. చాలా దొడ్డమనసు. నేరుగా అతనింటికే వెళ్లు" అన్నారు శివనారాయణగారు. అంతకుమించి అతను ఆ వెంకట్రామయ్యగారి గురించి

చెప్పలేదు. అయినా రంగబాబుకి ఏనుగు నెక్కినంత సంతోషం కలిగింది.

ఆ ఆసామి చెప్పిన డాబా ఇంటి ఇనుపగేటు తీసుకొని లోనికి వెళ్ళాడు. గేటు దగ్గరనుండి కంకర పోసినబాట, బాటకిరువైపులా రంగురంగుల పూలమొక్కలు, విశాలమైన ఆవరణా, ఒక ప్రక్క జామ, నారింజ, కొబ్బరిచెట్లు.

వెంకట్రామయ్యగారు బాగా స్థితిపరుల్లాగే ఉన్నారు అన్న భావం కలిగింది. తలుపు బాగా తెరచివుంటే "వెంకట్రామయ్యగారూ" అని పిలిచి గుమ్మంలో నిలబడ్డాడు.

లోపల రెండుకుర్చీలు ఉన్నాయి. లోపలి ద్వారానికి కర్టెనువుంది. అంతదూరం బరువైన ఎటాచీని మోసుకువచ్చాడేమో కుర్చీలు చూడగానే కూర్చోవాలనిపించినా 'సభ్యతకాదు' అని నిల్చునే వున్నాడు.

"ఎవరు కావాలి?"

ఆ కోకిల కంఠం వినగానే అప్రయత్నంగా ఈలోకంలో పడ్డాడు. రంభా ఊర్వశులను తలదన్నే సౌందర్యమూర్తి. తను ఉద్యోగం కోసం వచ్చాడా. పెళ్ళిచూపులకా? వెంకట్రామయ్యగార్కి ఇంతటి అందమైన అమ్మాయి కూడా వుందని చెప్పని శివనారాయణగారిమీద ఒకింత కోపం వచ్చింది.

తనెవరికోసం వచ్చాడో చెప్పాడు. చెప్తున్నప్పుడు తత్తరపాటు కూడా పడ్డాడు.

"వెంకట్రామయ్యగారికోసమా? వారు పెరటి వేపు ఔట్‌హౌస్‌లో వుంటున్నారు" ఆ అమ్మాయి వెంటనే తెరమరుగు అయింది.

కణకణలాడుతున్న నిప్పులమీద నీళ్లుజల్లితే చల్లారిపోయిన నిప్పులా అతని ఉత్సాహం చల్లారి పోయింది. ఈ హరిణాక్షి వారి అమ్మాయి కాదన్నమాట! ఈ ఇల్లూ ఈ పిల్లనూ చూడగానే వెంకట్రామయ్యగారి స్టేటస్‌మీద ఒక అభిప్రాయం కలిగింది. వారు ఔట్‌హౌస్ వాస్తవ్యులు అని తెలియగానే అతను నిరాశపడ్డాడు.

బరువైన పెట్టెను అంతకన్నా బరువైన గుండెను మోసుకొని పెరటివైపు నడిచాడు.

ఔట్‌హౌస్ తలుపులు చేర వేసివున్నాయి.

"వెంకట్రామయ్యగారూ!"

"ఎవరు?" అంటూ ఒక యువతి వచ్చింది. రంభ ఊర్వశిలాంటి అతిలోకసుందరిని అంతకు క్రితమే చూసిన రంగబాబుకి ఆ యువతి అందగత్తెకాదని తోచింది. సాదాచీర జాకెట్టు, చిన్నతనంలో ఆటలమ్మ పోసి వుంటుంది, ముఖంమీద మూడు నాలుగు మచ్చలు.

"నాన్నగారు పనిమీద వెళ్ళారు పొద్దుపోతేనేకాని రారు" అంది రంగబాబుకేమీ పాలుపోలేదు. చేతిగడియారం పన్నెండు చూపుతున్నది. మరో ఆరుగంటలు నిరీక్షిస్తేనే కాని వారిని కలుసుకోవటం సాధ్యం కాదు. అంతవరకు ఎక్కడ గడపటం?

ఈలోగా ఆ అమ్మాయి లోనికివెళ్ళి మంచినీళ్లు తెచ్చింది. బయట మామిడి చెట్టు నీడలో కుర్చీవేసి కూర్చొండి అంది. రెండు నిమిషాలు ఆలోచనారహితంగా కూర్చున్నాడు.

"చూడండి, అలా వూరిలో తిరిగి వస్తాను. అంతవరకు ఈ పెట్టె ఇంటిలో వుంచండి" అన్నాడు మరో మార్గాంతరం లేక.

"ఎప్పుడనగా ఇంటినుండి బయలుదేరారో? మీకు ఈ వూరిలో డబ్బుపెట్టినా భోజనం దొరకదు. ఒక్క పావుగంట ఓపిక పట్టారంటే మీకు భోజనం పెడతాను. ఆ తరువాత కావలిస్తే వూరు చూసిరండి."

ఇంటిలో మరోమనిషి లేనప్పుడు అక్కడ భోజనం చేయాలంటే అదో అపరాధంలా అనిపించింది. ఇరుగుపొరుగులు పట్టించుకోక పోవటానికి ఇది విశాఖపట్నంలాంటి నగరం కాదు. తనను చిక్కుల్లో పెట్టుకోవడమేకాక ఆ కుటుంబాన్ని రచ్చకీడ్చడం జరుగుతుంది.

"నాకాకలిగాలేదు"

"పన్నెండు గంటలు దాటినా ఆకలిగాలేదంటే నమ్మదగిన విషయంకాదు. భోజనం దగ్గర ఇంత మొహమాటం పనికిరాదు. మీకు అన్నమైనా పెట్టలేదంటే మానాన్న నన్ను క్షమించరు. వారిచేత చీవాట్లు తినిపించటమే మీ అభిమతమైతే నేను వేరే చెప్పేదిలేదు" అన్నది.

ఇంత ఆప్యాయతను చూపిస్తున్న ఆమె మాటను త్రోసిపుచ్చలేక పోయాడు. అనేకంటే అతని కడుపులో ఆకలివలన ఆమె అభ్యర్థనను త్రోసిపుచ్చలేదు అనడం సమంజసం.

"మీరు స్నానంచేస్తారా? అదిగో ఎదురుగా నుయ్యివుంది" ఆమె చేతిలో తువ్వాలు సబ్బుబిళ్ళా వున్నాయి.

"స్నానం చేయాలి. అయితే వీటి అవసరంలేదు" అంటూ పెట్టె తెరచి పైజామా తువ్వాలు సబ్బుతీసి నూతి వద్దకు వెళ్ళాడు. స్నానం చేసివచ్చేసరికి ఆమె విస్తరివేసి వడ్డించింది.

'ఆమె ఎవరు?' అసలు ముఖపరిచయమైనాలేదు. ఎందుకు వచ్చారు అని అడగనైనా అడగకుండా చల్లటి ఆతిథ్యం ఇచ్చిన ఆమె అంటే అతనికి గౌరవం కలిగింది.

"ఇంక మీరు తిరగాలనుకుంటే వెళ్ళిరండి. అయితే అన్నం తినగానే ఎండలో తిరగటం ఆరోగ్యానికి మంచిదికాదు. అంతగా చూడాలనుకుంటే కొంచెం చల్లబడిన తరువాత వెళ్ళండి. ఈవూరు చూడడానికేమంత వింతైనదేమీకాదు. కాదంటే ఊరు బయట పంటపొలాలూ గలగల పారే సువర్ణరేఖ, నదిపక్కగా ఎత్తైన కొండలు. ఆకాశం భూమికలిసే సుందరదృశ్యం చూడవలసినవే" అంది. అప్పటికే ఆమె గదిలో పక్క వేసింది.

"మీరు కొంతసేపు విశ్రమించండి"

పల్లెటూరి అమ్మాయి ముక్కూముఖం తెలియని పరాయివాడి పట్ల ఇంతనమ్మకం వుంచడంతో అతనికి కించిత్తు ఆశ్చర్యం కూడా వేసింది. విశ్రమించడానికే నిశ్చయించుకున్నాడు. ఆమె కొసరికొసరి వడ్డించగా రోజు కన్నా అధికంగా తిన్న రంగబాబు ఆస్థితిలో అడుగు బయటకుపెట్టే స్థితిలో లేడు.

రంగబాబు అలా ఎంతసేపు నిద్రపోయాడో లేక ఇంకా ఎంతసేపు నిద్రపోయివుండేవాడో, పక్కగదిలో జరుగుతున్న సంభాషణతో అతనికి మెలకువ వచ్చింది.

"లేచావా బాబూ" ఆ గృహయజమాని ప్రశ్నించాడు.

నమస్కారం, నాపేరు రంగబాబు. విశాఖపట్నం నుంచి వచ్చాను. ఇర్రిగేషన్ డిపార్టుమెంటులో ఓవర్సీరుగా నన్ను ఇక్కడ పోస్టుచేశారు. ఇంకా మా ఆఫీస్ సిబ్బందివచ్చి వుండదు. ఈవూరిగుండా పారుతున్న సువర్ణరేఖ నదికి ఆనకట్టకట్టి ఆ నీటిని సేద్యానికి ఉపయోగించాలన్నది ప్రభుత్వ పథకం. ఈవూరు నాకు కొత్త. శివనారాయణగారు మిమ్మల్ని కలియమన్నారు. తగినవసతి గురించి మీరు

ప్రయత్నించగలరని హామీ ఇచ్చారు. అందుకే నేరుగా మీ యింటికి వచ్చాను. నేనొచ్చిన సమయానికి మీరులేకున్నా మీ అమ్మాయి చాలా అప్యాయంగా ఆతిథ్యం ఇచ్చింది" అన్నాడు మాటలలోనే కృతజ్ఞతను అభివ్యక్తంచేస్తూ.

"మేమిచ్చిందీ ఒక అతిథ్యమేనా? ప్రభుత్వం ఇన్నాళ్ళకైనా ఈ పరిసరాలను గురించి పట్టించుకోవటం సంతోషం. భగవంతునిదయ వలన ఈ బీడు భూములు ధాన్యాగారాలవుతాయి. ఈ గడ్డ అన్నపూర్ణ అవుతుంది. మీ కృషిఫలించాలని ఆ భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాను."

వెంకట్రామయ్యగారికి ఈఇలాకాలో భూములుండబట్టే అతను సంతోషిస్తున్నాడని రంగబాబు భావించాడు. అయితే అతను భూకామందు కాదని అతనికి తరువాత తెలిసింది.

"నాకు ఉండటానికి ఇల్లు కావాలి. మీరు తలచుకుంటే అది పెద్దసమస్య కాదనుకుంటాను."

"బాబూ! ఇది పట్టణంకాదు అద్దెకు ఇళ్లు దొరకడానికి. నేను తప్పకుండా ప్రయత్నిస్తాను. అంతవరకు మాతోపాటే వుండు."

రంగబాబు గొంతుకలో వెలగకాయ పడ్డట్లయింది. వెంకట్రామయ్య గారిది ఏమంత పెద్దయిల్లుకాదు. రెండుగదుల యిల్లు. ఒకగది విశాలమైనది అయినా రెండవది చాలా చిన్నది. తనుకూడా వారితోపాటే వుంటే వారికెంతో శ్రమ. ఆ పిల్ల స్వేచ్ఛకు భంగం.

"బాబూ! ఏమిటాలోచిస్తున్నావు. పట్టణంలో పెరిగిన నీకు ఈ ఇరుకు ఇంటిలో గడపటం కష్టంగానే వుంటుంది. కాని మరో ఇల్లు దొరికేవరకు ఎక్కడైనా తలదాచుకోవాలిగా! సంకోచించకు"

"నేను మీతోపాటు ఉంటే మీకు ఇబ్బంది అని తలుస్తున్నాను."

"భలే! మొగమాటస్తుడివి. మా ఇబ్బందుల మాటకేం. ఇలా ఆప్యాయంగా వచ్చేవారు ఎంతమంది?"

నెలరోజులకు పైగానే వారింటిలో గడపవలసి వచ్చింది రంగబాబుకి.

★ ★ ★

గౌరవం మన్ననా వ్యక్తిని బట్టి ఆపాదిస్తామా? వృత్తిని బట్టా? వ్యక్తి వున్నతుడౌతే వృత్తి ప్రతిబంధకం కాకపోవచ్చు. పరిస్థితులు కూడా అందుకు దోహదమివ్వాలి.

రంగబాబుకి నెలరోజుల్లో చాలా సంగతులు తెలిసాయి.

వెంకట్రామయ్య కూతురుపేరు క్షితిజ. చాలా విచిత్రమైన పేరు.

"సీతను నాగేటిచాలు అని ఎందుకంటారు? ఆమె జనకమహారాజుకి భూమిలో దొరికింది. శకుంతల అన్నపేరు దుష్యంతుని భార్యకెలా వచ్చింది? శుకపికాదులు పెంచటం వలననే. భూదేవి తల్లి – ఆకాశం తండ్రి ఈ రెండూ కలిసేటట్లు కనుపించేచోటు క్షితిజ. అందుకే నా కూతురిపేరు క్షితిజ" అన్నాడు వెంకట్రామయ్యగారు.

"...... ఆమె మీ కూతురు కాదా?"

"ఎందుకు కాదు. శకుంతల కణ్వమహర్షి కూతురైనప్పుడు శ్రీకృష్ణుడి తండ్రి నందుడైనప్పుడు క్షితిజ నాకూతురు. నేనామె తండ్రిని."

క్షితిజ జన్మరహస్యం తెలుసుకోవటం రంగబాబుకి సాధ్యంకాలేదు. వెంకట్రామయ్యగారు ఒక

బిడ్డ తండ్రి అయినా ఆ జన్మ బ్రహ్మచారి. ఎవరోచేసిన పాపఫలం ఈ క్షితిజ – అని కొందరు నోటవిన్నాడు. అయితే అది పాపఫలం అంటే వెంకట్రామయ్యగారు అంగీకరించరు. కళ్లు తెరువని పసికందు దొరికితే ఆమె పాలనాభారం తన నెత్తిన వేసుకున్నాడు. అతను మహనీయుడా? లేక ఈ పాపఫలంలో అతనికీ భాగం వుందా?

కొన్ని విషయాలు మనిషికి తెలియనేకూడదు. తెలిసిన తరువాత వాటి పరిణామాలు సవ్యంగా వుంటా యనుకోలేము.

వెంకట్రామయ్యగారిపై గల గౌరవం అభిమానం రంగబాబుకి అనతికాలంలోనే తుడుచుకు పోయాయి. అతని వృత్తి ఏమంత గౌరవప్రదమైనదికాదు. క్షితిజ వుత్తమకుల సంజాతకాదు. ఆమెను పెంచడంలో అతనికి ఎలాంటి సంబంధము వుంది? తనను వారింటిలో బంధించివుంచడంలో ఆప్యాయత వెనుక స్వార్థం ఎంత? మనిషిపట్ల అవిశ్వాసం ఏర్పడనేకూడదు, ఏర్పడితే ప్రతిచర్యలోనూ ఏదో సంకుచితత్వం స్వార్థపరత్వం కనుపిస్తాయి.

అద్దె ఇళ్లు దొరకడానికిది బస్తీకాదన్నారు. అది వాస్తవంకాదని రంగబాబుకి అర్థమైంది. తనతో పాటే వుంచుకోవాలనడంలో ఎంత స్వార్థం వుంది? తమ మధ్య బంధుత్వంలేదు. ఎదిగిన కూతురు ఇంటిలో వుంది. తనదా చెప్పుకోదగిన వుద్యోగం.

“నీకేమోయ్, వెంకట్రామయ్యగారింటిలో అల్లుడి హోదా వెలిగిస్తున్నావు. మాలా చెయ్యి కాల్చుకోవలసిన అవసరంలేదు. ఏ.ఇ.నవ్వుతాలకంటాడు.

“ఇలా ఆరు నెలలుంటే నీవు నిజంగా వారి అల్లుడివే అవుతావు” అంటాడు శర్మ.

నిజంగా వారిలో అంత స్వార్థం వుందా? అతని కూతుర్ని తాను ప్రేమించి పెళ్ళిచేసుకుంటానని అతను భావిస్తున్నాడా? ఆ అపురూపసుందరికి మించిన భార్య తనకు దొరకదా?

ఆలోచనల్లో ఒక వక్రతవచ్చింది రంగబాబుకి ఆ ఇంటిలో వుండటం ముళ్ళమీద వున్నట్లే వుంది. వెంకట్రామయ్యగారి ముందుచూపు గురించి రంగబాబుని చాలామంది హెచ్చరించారు. పదేపదే ఒకే విషయాన్ని ఎందరో ఎన్నో సందర్భాలలో అంటూ వుంటే అందులో నిజం వుండబోదు అని ఏ మానవుడు మాత్రం అనుకోగలడు?

వెంకట్రామయ్యగారు వేసిన వలలో చిక్కుకుంటే....?

అతను పగలల్లా ఇంటిలో వుండడు. తాను రోజులో కొన్ని గంటలైనా విధిగా ఇంటిలో వుంటాడు. వయసొచ్చిన స్త్రీపురుషులు ఏకాంతంగా వుంటే? రోజులన్నీ ఒకలాగుండవు. ఏనాడైనా మతి గతి తప్పుతే?... క్షితిజ ఏమాత్రమైన చొరవ తీసుకుంటే?... జరిగేది ఏమిటి? జరగబోయేది ఏమిటి?...

శాశ్వతమైన అనుబంధాన్ని కోరుకునేవారు అసత్యాన్ని ఆధారం చేసుకోలేరు. నిజం ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో తెలియదు. తప్పు చేసిన తరువాత అది తెలుసుకొని ఆమెను చేసుకుందికి తను సిద్ధపడగలడా? అలాగని దొరికిన అవకాశాన్ని వినియోగించుకొని ఒక అమాయకురాల్ని అన్యాయం చేసి మరో క్షితిజ జన్మకు కారణం కాలేడు. పోనీ ఏనాటికైనా తాను వివాహం చేసుకోవలసిందేగా? తన మీద ఆశలుంచుకున్న క్షితిజను చేసుకుంటే.......?

ఆమె అతిలోకసుందరికాదు. ఆస్తిపాస్తులు లేవు. జన్మరహస్యం నిగూఢం. మరి ఏం చూసుకొని ఆమెనే చేసుకోవాలి?

ఏతావాతా రంగబాబుకి ఆ ఇల్లు వదిలేయాలన్న కోరిక కలిగింది. వెంకట్రామయ్యగారిమీద జుగుప్స కలిగింది. ఆ వూరిలో అద్దె ఇళ్ళు దొరకవన్నారు. అది నిజంకాదు. అదే వాస్తవమైతే తన తోటి వుద్యోగులు చెట్లకింద బస చేస్తూ ఉండేవారు.

కరణంగారు తన ఇంటిలో వుండమని రంగబాబుని ఆహ్వానించారు. మునసబూ అదేవిధమైన అభిప్రాయం వెలిబుచ్చారు. రంగబాబుకి వసతి సదుపాయం కల్పించేందుకు ముందుకివచ్చిన వారిలో డాబాయింటి రామస్వామి వున్నాడు. వీరందరిలోనూ స్వార్థం ఉంది. పల్లె ప్రజలు అమాయకులనుకుంటే అది సదభిప్రాయం కాదు. వారిలోను స్వార్థం పేరుకుపోయింది. ఆ విషయం గ్రహించటం కష్టంకాదు. రంగబాబు చేతిలో స్టోరు వుంది. ప్రాజెక్టు కోసం సిమ్మెంటు ఇనుమూ రోజూ లారీలలో దిగుతోంది, సిమ్మెంటు చవుకగా సంపాదించాలన్నా తమ వారికి వుద్యోగాలు ఇప్పించాలన్నా రంగబాబులాంటివారి ఆసరా కావాలి.

కరణం మునసబు అభ్యర్థనకన్నా రామస్వామి అభ్యర్థన అతన్ని ఆకర్షించింది. కారణం...?

క్షితిజ అతని కూతురు కాలిగోటికి సరితూగదు. వారింటిలో వుంటే ఆమెను రోజూ చూసే అవకాశం వుంటుంది. ఏడడుగులు కలసి నడుస్తే వారు వీరౌతారు. వారింటిలో వుండి తరచు కలుసుకొని మాట్లాడుతూ వుంటే అది చివరకు ప్రేమగా మారే అవకాశం ఉంది. క్షితిజంటే నచ్చలేదుకాని శ్యామలకేం తక్కువ? ప్రేమ వివాహమైనా కట్న కానుకలకు లోపం వుండదు.

రంగబాబు ఆశయం రామస్వామి ఆశయం పరస్పర విరోధమైనవికావు.

శ్యామలతో పరిచయం దినదినప్రవర్ధమానమైంది. పని జరుగుతున్న చోటుకి శ్యామల ఒకటి రెండు పర్యాయాలు రంగబాబుతో వెళ్ళింది. ఆమె నవ్వుతూ ఉంటే, రంగబాబుకి ప్రకృతిలో వింతలు గోచరించేవి.

★ ★ ★

వెంకట్రామయ్యగారు రంగబాబుని అప్పుడప్పుడు కలుస్తూనే వుండేవాడు. ఏదో మిషను తన ఇంటికి భోజనానికి ఆహ్వానించేవాడు.

నలుగురిలో వుండేవాడికి నమ్మిక ముఖ్యం. నమ్మిచెడవచ్చు. నమ్మక బాగుపడడం సాధ్యం కానిది. అందులోనూ స్నేహితులు ఒకే మాట అంటే కాదనుకోవటం ఎలా? ఆ పిలుపులో ఇంకా స్వార్థం వుంది. ఎలాగైనా తనను మచ్చిక చేసుకోవాలన్న అభిమతం నిబిడీకృతమైంది అనుకునేవాడు. అతను పలకరిస్తే వంటిమీద తేళ్లూ జెర్రులు ప్రాకినట్లు భావించుకునేవాడు.

నలుగురితో కలిసిమాట్లాడుకునే సమయంలో నూనె మరకల బట్టలతో దర్శనమిచ్చి 'బాగున్నావా బాబూ?' అని పలకరిస్తే అసహ్యించుకునే స్థితికి దిగజారేడు.

"చూడండి! వెంకట్రామయ్యగారూ! మీరు ఇలా తరచువచ్చి నాపనిలో ఆటంకం కలిగించకండి! నేనొచ్చిన కొత్తలో మీరిచ్చిన ఆతిథ్యాన్ని దృష్టిలోవుంచుకొని ఇంతవరకు మిమ్మల్ని గౌరవిస్తున్నాను. మీరాకలోని ఆంతర్యాన్ని అర్థం చేసుకోలేని పసివాడనుకాను. హీనకులజాతను కట్టపెట్టాలనుకుంటే అది

మీ తుచ్ఛపుకోరికే అవుతుంది. మంచివంశంలో జన్మించిన నేను అలాంటి చరిత్రహీనురాలిని ఎలా పరిణయమాడుతాననుకుంటున్నారు?" రంగబాబు క్షణికావేశంలో ఒకనాడు తొందరపాటుతో అనేశాడు.

"ఇదా నీవు నన్నర్థం చేసుకున్నావు?" వెంకట్రామయ్య బాధతో అన్నాడు. అతని కన్నులు ముద్దయ్యేయి.

రంగబాబు ఆ తరువాత తన తొందరపాటుకి విచారించకపోలేదు అయితే అది గతజల సేతుబంధనం.

శ్యామలా రంగబాబు ప్రణయం అంతరాయం లేకుండా సాగుతున్నది. చివరకు పెళ్ళి నిశ్చయమైంది. కొన్ని విషయాలు గోప్యంగా దాచినా దాగవు. ఈవిషయం ఎంత మందికి తెలిసిందో తెలియదోకాని వెంకట్రామయ్య చెవినపడింది. ఈర్ష్యా పగ అనే పదాలకు అర్థం తెలియని అతను రంగబాబుని అభినందించకుండా వుండలేకపోయాడు "బాబూ! మాకూ బూరెముక్కలు పెడతావటగా! శ్యామల నీకు నిజంగా తగినపిల్ల, నీ ఎంపిక బాగుంది" అన్నాడు.

"వెంకట్రామయ్యగారు! ఆ రోజు క్షణికావేశంలో నోరుజారేను క్షమించండి."

"వెఱ్ఱివాడా! ఇంత చిన్న విషయానికి నొచ్చుకోవాలా? అది మానవ సహజం. ఆ సంగతి నేనప్పుడే మరిచిపోయాను. ఉద్యోగరీత్యా వచ్చి మావూరి వారి అల్లుడౌతున్నావంటే నాకదే సంతోషం నాకు క్షితిజ ఎంతో శ్యామలా అంతే!"

రంగబాబుకి ఒక విషయం అడగాలని వుంది. "మీరు క్షితిజను నాకివ్వాలని అందుకే నాపట్ల అమితానురాగాలు చూపించేవారని నలుగురూ అనేవారు అది సత్యదూరమా" అని.

కాని అలా అడిగే ధైర్యమూలేదు. అతని హృదయాన్ని మరోమారు గాయపర్చడమే మిగులుతుంది. అతనివ్వబోయే జవాబు అనూహ్యంకాదు. 'నన్ను చులకనగా అంచనా వేసుకున్నావు. క్షితిజ పెళ్ళి పెద్దసమస్య కావచ్చు. కాని అందుకోసం వలవేసి నిన్ను అందులో ఇరికిస్తానని ఎలా అనుకున్నావు? ప్రేమించడం నేరం కాదు, సహజం. అయితే అసహజరీతిలో ప్రేమజాలాన్ని విసిరి నిన్ను అల్లుడిగా చేసుకోవాలన్న దుర్బుద్ధి మాకులేదు" అని తన ముఖం మీదే అనేయగలడు.

★ ★ ★

రోజులన్నీ ఒకేలాగుండవు. ఒకమారు సైటుమీదపని చూసి జీపులో వస్తున్నాడు రంగబాబు సైటుకోసం వేసిన టెంపరరీ రోడ్డు. వంకరటింకరలకు లెక్కలేదు. లోతులోంచి జీపు మీదకు ఎక్కుతున్నాడు ఎదుటినుంచి రాళ్లతో నిండిన లారీ దిగుతున్నాది. ప్రమాదాలు అజాగ్రత్త వలననే జరుగుతాయి. ఎవరి అజాగ్రత్త వలన ప్రమాదం సంభవించింది అన్న విచారణ వలన ఫలితం శూన్యం. రెండు వాహనాలు ఢీకొనటం రంగబాబుకి తెలుసు, ఆతరువాత ఏమి జరిగింది?...

తెలివి వచ్చేనాటికి చేతికీ కాలికీ బేండేజీలతో పాతికమైళ్ళ దూరంలో ఒక ఆసుపత్రిలో ఉన్నాడు.

"అదృష్టవంతుడివి చిన్నదెబ్బలతో బయటపడ్డావు ముందుసీటులోని ఏ.ఇ., డ్రైవరు పాపం అక్కడిక్కడే చనిపోయాడు." అన్నారు వెంకట్రామయ్యగారు. అతని ముఖం వాడిపోయింది. మనిషి బలహీనంగా వున్నాడు. పక్కనే క్షితిజకూడా వుంది. ఇద్దరిముఖాలలోను ఒక విధమైన [illegible]

శ్యామలకోసం రంగబాబు కళ్లు గాలించాయి

"వెంకట్రామయ్యగారూ! ఎంతకాలంగా నేనిక్కడ ఉన్నాను."

"ఎంతకాలమైతేనేం? నీవు బ్రతికావు"

"శ్యామల లేదా?'

"వస్తుంది బాబూ"

ఇంతలో డాక్టరూ నర్సు వచ్చారు. వెంకట్రామయ్య, క్షితిజ బయటకు వెళ్ళారు.

"డాక్టర్! నేను ఎంతకాలంగా ఇక్కడున్నాను."

"మీరు కూర్చున్న జీపు ఏక్సిడెంటుకి లోనైంది. మీకాలి ఎముకకు బాగా దెబ్బతగిలింది. తీసివేయవలసి వస్తుందనుకున్నాం. రక్తం కూడా బాగా పోయింది. ఏక్సిడెంటు విషయం తెలియగానే రామస్వామిగారు మీకాబోయే అర్ధాంగి శ్యామలా వచ్చారు. రామస్వామిది మీగ్రూపే.

"అతను తన రక్తాన్నిచ్చి నన్ను బ్రతికించాడా? డాక్టర్! నాకాలు తీసేసారా? నేను అవిటివాడినా?"

"రక్తమిచ్చినందున మీరు బ్రతుకుతారు కాని కాలుబాగుకాదని అతను తెలుసుకొని అనారోగ్యం అనే నెపంతో తన రక్తమివ్వడానికి అతను అంగీకరించలేదు. చాలామంది రక్తం పరీక్ష చేసాము. మీది 'ఓ' గ్రూపు ఆ గ్రూపు దొరకటం అరుదు. అదిగో అలాంటి సమయంలో దేవుడిలా వెంకట్రామయ్యా గారు ఆదుకున్నారు. మనిషిగా మీరు బ్రతికాలంటే కాలుతీసేయాల్సిన అవసరం ఉంది."

"డాక్టర్! నన్నెందుకు బ్రతికించారు? ఈ అవిటి బ్రతుకు ఎంతహీనమైంది. అంతకన్నా చావే నయం."

"మీరు వర్రీకాకండి. మరేం భయంలేదు. మీరు అదృష్టవంతులు."

"డాక్టర్! మనిషి ప్రాణాలు నిలబెట్టడం మీ విధ్యుక్తధర్మం కావచ్చు. అవిటి జీవితం ఎంత దుర్భరమో మీకు తెలియదు. శ్యామల ఈ అవిటివాడిని చేసుకుంటుందా? నాకీ ప్రపంచంలో ఏం మిగిలింది? ఏం చేసుకొని నన్ను జీవించమంటారు?"

"శ్యామల గురించి మీరు ఆలోచించవలసిన పనిలేదు. ఆనాడే ఆ తండ్రీకూతుళ్లు మీమీద ఆశవదులుకుని వెళ్ళిపోయారు. కాని...."

"ఏమిటి?"

"మీకాలు తీసివేయలేదు. వెంకట్రామయ్యగారు పట్నం వెళ్ళి మంచి అనుభవంగల ప్రైవేటు డాక్టర్ని తీసుకువచ్చారు. మీ చికిత్సకోసం తన జీవనోపాధి అయిన సైకిలుషాపుని అమ్మి మీ చికిత్స చేయించారు. విరిగిన ఎముకస్థానంలో స్టీలురాడ్ అమర్చాము. మీరు మామూలుగా నడవగలరు.

★ ★ ★

రంగబాబులో ఆత్మసంఘర్షణ మొదలైంది.

కావాలని ప్రాకులాడడమే కనిపిస్తుంది. కాని కోరుకున్నది ఒక్కొక్కమారు దక్కదు. చావుబ్రతుకుల మధ్యవున్న తనకు కాబోయే అర్ధాంగి రాత్రీపగలూ సేవలు చేస్తూ బ్రతికించుకుంటే అందులో ఎంతటి తృప్తి వుండేది? జీవితంలో ఒక్కక్షణంలో చేసిన పొరపాటు జీవితాలనే మార్చివేస్తుంది. అవిటి జీవితం హేయమైనదే కావచ్చు. కాని ప్రమాదాలు కోరితెచ్చుకునేవికావుగా? ఈ ప్రమాదం వివాహం జరిగిన

తరువాత జరుగుతే శ్యామల ఇంతతేలికగా తప్పుకునేదా? మనిషి ఔన్నత్యానికి కొలమానం అతని అంతస్తూ ఆస్తీ కాలేవు. మనిషి ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు ఆదరించటం, అభిమానం చూపటం సహజమే. కాని మనిషి ఆపదలో వున్నప్పుడు ఆదుకోవాలనే అనుకునేవారు అరుదు. రామస్వామికి తగినంత ఆస్తి వుంది. అతను కోరుకుంటే సమయానికి సరియైన వైద్యం చేయించగలిగేవాడు. కాబోయే అల్లుడిపట్ల ఆ మాత్రం అభిమానం చూపించలేక పోయాడు. ఈనాడు వైద్యవిజ్ఞానం బాగా పురోభివృద్ధి చెందింది నయం కావనుకునేరోగాలు నయమౌతున్నాయి. రామస్వామి మీద రంగబాబుకి అసహ్యం వేసింది.

వెంకట్రామయ్యగారిమీద అంతులేని ఆదరం పెరిగింది. ఎవరికెవరు? తాను అతనికేమౌతాడు? తన ఆరోగ్యంకోసం అతనెందుకు ప్రాకులాడేడు? ఆపరేషను మాటతో అయ్యేదికాదు. తన జీవనోపాధి అయిన షాపుని అమ్మవలసిన అవసరం అతనికెందుకు? ఆతని ఋణం తనెలా తీర్చగలడు?

రంగబాబు తిరిగి మనిషియ్యాడు. యథావిధిగా ఉద్యోగంలో చేరాడు.

"రంగబాబు! నీవు అదృష్టవంతుడవని చెప్పేకంటే మా శ్యామల అదృష్టవంతురాలని చెప్పు కోవాలి. ఎంత డబ్బు ఖర్చు అయినా సరే నయం చెయ్యమని డాక్టరుకి చెప్పాను. నాకు కాలునయం చెయ్యడం సాధ్యం కాదన్నారు. వెంకట్రామయ్య నీమీద దయ చూపినట్లు నటించి నయం చేయించింది తనేనని కోతలు కోస్తున్నాడు. అతను ఖర్చుచేసిన డబ్బు పారేస్తాను. ఏమనుకుంటున్నాడో."

పరిస్థితులను అర్థంచేసుకోలేని పసివాడిని మాయమాటలతో మభ్యపరిచే వాచాలత.

"యుగానికి లేని విలువ ఒక్కక్షణం సంతరించుకుంటుంది. జీవితకాలం అంతాశ్రమించి నిర్మించిన దాన్ని ఒక్కక్షణంలో సమూలంగా నిర్మూలించవచ్చు. మానవతను విస్మరించటం ఒక్కక్షణమైనా పరిణామం భీకరంగా వుంటుంది. నాకు పరిస్థితులు తెలియవని అపోహపడకండి. కనీసం రక్తదానం చేసినా అవిటిగానైనా బ్రతకలగలనన్నారు డాక్టర్లు. మీ రక్తాన్ని సాటిమనిషికి ఇవ్వమని కోరారు. అప్పుడు మీరేంచేసారు? అవిటివాడికి రక్తం దానం చేసి ప్రయోజనం లేదని, ఆ ఒక్కక్షణంలో మానవత్వాన్ని విస్మరించారు. భగవంతుడి దయవలన నేను బ్రతికాను, మనిషినయ్యాను. భగవంతుడు ఎక్కడో అదృశ్యంగాలేడు. మంచిమనుషుల హృదయాల్లో ఆసీనుడై వున్నాడు. ఎంతో ఆస్తిపాస్తులున్న మీరు సాహ సించి ఒకమనిషి ప్రాణం నిలబెట్టలేకపోయారు. తన దగ్గర ఏమీలేకున్నా అతను నిస్వార్థంగా అంతా ధారపోశాడు. ఈనాడు నేను మనిషినయ్యాను అంటే అది శ్యామల అదృష్టం కాదు. క్షితిజ అదృష్టం."

రామస్వామి కోపాన్ని ప్రదర్శించి వెళ్ళిపోయాడు.

రంగబాబు తన మనోవాంఛను వెంకట్రామయ్యకు తెలియపరిచాడు. ఈప్రస్తావన అతణ్ణి దిగ్భ్రాంతుణ్ణి చేసింది.

"బాబూ' మనిషిని ఆదుకోవటం ఒక అద్భుత విషయమా? కష్ట సమయంలో ఆదుకోవటం మానవధర్మం. నీకు రామస్వామి తన కూతుర్ని ఇవ్వాలనుకుంటున్నాడు. నువ్వా ఆ అమ్మాయిపట్ల మొగ్గుచూపావు. నాకు క్షితిజఎంతో శ్యామలా అంతే. ఒక చిన్నపొరపాటు మూలంగా ఇప్పుడు నీ నిర్ణయం మార్చుకోవటం సమంజసంకాదు. పైగా ఒక వూరివాళ్లం. వాళ్లకళ్ళలో నేను స్వార్థపరుడిని అవుతాను."

"ఇది మీ ఔన్నత్యానికి తార్కాణం. మనిషి ఉచ్ఛస్థితిలో వున్నప్పుడు ఆదరించటం అభిమానం

చూపటం లోకసహజం. ఆపదలో వున్నప్పుడు ఆదుకునేవారు అరుదు. మీరు రెండో కోవకు చెందుతారు. నా నిశ్చయాన్ని మార్చాలని మీరు తలుస్తే అది దురదృష్టకరం. శ్యామలది అపురూపమైన అందంకావచ్చు. ఆ అందం వెనుక అనురాగం లేదు. ఆత్మీయత లేదు. ఈ ఏక్సిడెంటు మూలాన నాకు కనువిప్పు కలిగింది."

వెంకట్రామయ్య బదులు చెప్పలేదు. మౌనం అర్ధాంగీకారం అనుకోవటంలో రంగబాబు పొరపాటులేదు.

అయితే బదులు చెప్పవలసిన బాధ్యత క్షితిజదైంది.

"రంగబాబుగారు! మానవత విస్మరించటం ఒక్కక్షణమే అయినా దాని పరిణామం భీకరంగా ఉంటుది. ఉద్యోగపరంగా మీరు మా వూరు వచ్చారు. మీకు మొట్టమొదట నీడనిచ్చింది మేము. భారతీయ సంస్కృతికి ప్రతీక మానాన్న. వారి పెంపకంలో పెరిగిన నేను మిట్టమధ్యాహ్నం భోజనాలవేళ వస్తే మీకు బలవంతంగానే కానీయండీ భోజనం పెట్టాను. మీరు ఎవరో - ఏపనిమీద వచ్చారో కనుక్కోవలసిన అవసరం నాకులేదు. భారతీయ వనితగా నా బాధ్యత అతిథిని ఆదరించటం వరకే పరిమితం. ఒంటరిగా మీరు అవస్తలెందుకుపడాలి? మానాన్న మిమ్మల్ని తమతోపాటే వుండమన్నారు. నెలరోజులు మీరు మా అతిథిగా మెలిగారు. ఆ నెలరోజుల్లో మా ప్రవర్తన ముఖ్యంగా నా ప్రవర్తనలో చెడు గోచరించిందా? మిమ్మల్ని ప్రేమజాలంతో ఇరికించడానికి నేను ప్రయత్నాలు చేసానా? మీ హృదయంమీద చేయి వేసుకుని చెప్పండి. మానవత్వంతో మీ బాగోగులను విచారించడం నేరమా? మీరు చేసిన ఆరోపణ క్షమించగలిగేదేనా? నిజమే నేను ఎలా జన్మించానో నాకు తెలియదు. కన్న వారెవరో నాకు తెలియదు. కళ్ళు తెరవని పసికందుని ఆదరించటం నేరమా? వెంకట్రామయ్యగారు చేసింది నేరమా లేక న్యాయమా? నామీద వాత్సల్యంతో అతను పెళ్ళికూడా చేసుకోలేదు. జన్మతః సంస్కారంరాదు. అది పెంచిన పెంపకంలో వుంటుంది. ఒకే తల్లి కడుపున పుట్టిన రెండు చిలకల కథ మీరు చదువుకోలేదా?

నా పేరు క్షితిజ. ఈ పేరు పెట్టాలని నా తండ్రికి ఎందుకు తట్టిందో ఈ రోజు నాకర్థమైంది. భూమి ఆకాశాలు ఒక రేఖ దగ్గర కలిసినట్లు మనం భ్రమిస్తాం. అయితే ఆ రేఖలు కలుసుకోవు. మీలాంటివారికి అదిసాధ్యం కానిది."

క్షితిజ మాటలు రంగబాబుకి తగలవలసినచోటే తగిలాయి.

(భారతి - మాసపత్రిక - మే 1985)